Page No. 1 - Green Page No. 1 - Red Page No. 1 Black

ఆర్‌డిటి

# ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం ఫిబ్రవరి 2005

FOR PRIVATE CIRCULATION ONLY

## మీరు గమనించారా !

నాన్‌స్టిక్ పెనాలను 'డుపాంట్' అనే సంస్థ అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో తయారుచేస్తోంది. వీటి ప్రయోజనం ఏమిటంటే, అందులో వండే ఆహార పదార్థాలు అడుగంటవు. ఇప్పుడు చాలామంది చపాతీలు, రొట్టెలు చేయడానికి ఇనుప పెనాలను మానివేసి నాన్‌స్టిక్ పెనాలనే వాడుతున్నారు. ఇనుప పెనాలు, బాణలీల ద్వారా లభించే ఇనుము పోషకాలు ఈ కారణంగా మన శరీరాలకు అందకుండా పోతున్నాయి. ఆహార పదార్థాలు అంటుకోకుండా ఉండుటకు పెనాలకు "టెఫ్లాన్" అనే రసాయనిక పూత పూస్తారు. ఐతే, టెఫ్లాన్ పూతలో ఉపయోగించే "సి8" అనే రసాయనం కారణంగా, పరిసరాలలోని నీరు కలుషితమయ్యి అమెరికాలోని రెండు రాష్ట్రాలలో దాదాపు 80 వేల మంది ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయట. దాంతో 70 మిలియన్ అమెరికన్ డాలర్లతో వైద్య పరీక్షలు నిర్వహించమని రాష్ట్రస్థాయి కోర్టు ఉత్తర్వు జారీ చేసింది. అంతేగాక, 107.6 మిలియన్ అమెరికన్ డాలర్ల నష్టపరిహారం కూడా ఇవ్వమని ఆ ఉత్తర్వులో పేర్కొంది.

అధునాతన వస్తువులు ప్రజల ఆరోగ్యాలను ఏ విధంగా దెబ్బ తీస్తున్నాయో గమనించారా !

**(డౌన్ టు ఎర్త్, డిశెంబర్ 31, 2004 సౌజన్యంతో)**

ఖరీఫ్‌లోనూ, రబీలోనూ వేరుశనగ ఉత్పాదకత తగ్గడానికి గల కారణాలను గురించి కర్నాటకలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం, రాయచూరువారు పరిశోధించారు. ఉత్పాదకత తగ్గడానికి విత్తనం కాయ నాణ్యత లేకపోవడంతో పాటు కాయ ఎండబెట్టేటప్పుడు ఎక్కువ ఎండలో పెట్టి తరువాత నిలువ ఉంచడంలో చెమ్మ సోకినా జర్మినేషన్ తగ్గిపోతుందన్నారు. కాయ నేరుగా ఎండబెట్టడంకన్నా, కట్టెతోనే ఎండబెట్టడం మంచి ఫలితాలనిస్తుందని చెప్పారు. నీడలో ఎండబెట్టిన తరువాత ఎనిమిది నెలలు నిలువ ఉంచినా మొలక శాతం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఒకవేళ నీడ దొరకకపోతే ఎండలోనే కాయలు ఆరబోసి వాటిమీద చెట్లకొమ్మలు, ఆకులతో కప్పి ఉంచి ఆరు రోజులపాటు ఎండబెట్టడం శ్రేయస్కరం అని వారు చెప్పారు.

**(హిందూ - 20.01.2005)**

ఈ భూగోళంమీద చిట్ట చివరి చెట్టు నరికినప్పుడు,
ఈ భూగోళంమీద చిట్ట చివరి చేప పట్టినప్పుడు,
ఈ భూగోళంమీద చిట్ట చివరి నది విషతుల్యమైనప్పుడు
అప్పుడు ;
డబ్బు కడుపు నింపలేదనే వాస్తవం తెలుసుకుంటావు -

ఆమెన్.

అమెరికాలో స్థానిక తెగల ఒక సామెత !

**చిట్కా :** **జీలకర్ర చూర్ణం ఒక చెంచాడు, పంచదార రెండు చెంచాలు కలిపి తీసుకుంటే నోటిలో నుంచి అయ్యే రక్తస్రావం తగ్గుతుంది. కొత్తిమీర ఆకుల రసాన్ని రెండు, మూడు చుక్కలు ముక్కులో వేసుకుంటే ముక్కు నుండి రక్తం కారడం ఆగుతుంది.**

## అనంతపురం జిల్లాలో మెట్ట రైతులకు జీవనోపాధి

రైతు సోదరులు, సోదరీమణులారా ! నమస్కారములు !!

**పరిచయం :**

అనంతపురం జిల్లాలో వ్యవసాయము ఒక జూదములాంటిది. మరీ వర్షాధార వ్యవసాయమైతే అది ఒక మోసపూరిత జూదమే. ఈ జూదంలో ఎంతోమంది రైతులు తమ ఆస్తులను, ప్రాణాలను సహితం పోగొట్టుకుంటున్నారు. దాంతో గ్రామీణ వ్యవస్థ మరియు గ్రామాలలో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యి, గ్రామీణ జీవనం పరమ దారిద్ర్య స్థితికి పడిపోవడం జరిగింది. మరి ఇటువంటి దుర్భర పరిస్థితులలో గ్రామాలలో వర్షాధారంపై ఆధారపడిన రైతాంగ జీవనాన్ని పునరుద్ధరించడం సాధ్యమా ? అయితే ఎలా ?

మన భూములన్నిటికీ సాగునీరు ఎప్పటికైనా వస్తుందా ?

అనంతపురం జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడు కరువు గురించీ, నీటిసాగు లేకపోవడం గురించీ, సమాంతర కాలువ, హంద్రీ-నీవాలాంటి నీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు తీసుకొని రావలసిన అవసరం గురించీ పదేపదే చెపుతాము. ఆ విధంగా సాగునీటి వ్యవసాయాన్ని అభివృద్ధి చెయ్యడం అత్యంత ప్రాధాన్యమనీ, అత్యవసరమనీ నేను కూడా భావిస్తున్నాను. అందుకోసం 'అనంత' రైతాంగం ఉధృతపోరాటం చేయవలయునని కూడా నేను మనవి చేస్తున్నాను.

ఐతే, పెన్నహోబిళం, సమాంతర కాలువ, హంద్రీ-నీవా ప్రాజెక్టులన్నింటినీ మనం సాధించినా మన జిల్లా అంతటా 27 లక్షల ఎకరాలకు నీరు పారించలేవు. రైతాంగ సమస్యలను అవి అందరికీ తీర్చలేవు. మహా అంటే 6 లేక 7 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించగలవు. మన అనంతపురం జిల్లాలో మిగిలిన 20 లక్షల ఎకరాలకు ఎప్పుడైనా వర్షాధారమే గతి ! కాబట్టి, వర్షాధార వ్యవసాయాన్ని పునరుద్ధరించడంపైననే మన జిల్లా రైతాంగ భవిష్యత్తు ఆధారపడియున్నది.

నీకు గ్రామంలో 5 ఎకరాలు లేదా 10 ఎకరాల మెట్టభూమి వుంటే, దానిపైన ఆధారపడి నీవు జీవనం సాగించడం సాధ్యమౌతుందా ? 5 సంవత్సరాలు కష్టపడితే సాధ్యమౌతుంది ! కష్టమైననూ సాధించడం తప్ప మనకు వేరే మార్గమేమీ లేదు.

నీకు కేవలం 5 ఎకరాల భూమి ఉందనుకో. ఆ 5 ఎకరాలలో క్రింది చర్యలను పాటించి, నిలకడైన ఆదాయం వచ్చే విధంగా నీవు వ్యవసాయం చెయ్యవచ్చు. కరువుకు తట్టుకొనే ఆర్థిక పరిస్థితిని నీవు కల్పించుకోవచ్చు. అందుకు మన సంస్థ తరపున మీకు తగిన ప్రోత్సాహం, సహకారం మీకు అందించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. వాటర్‌షెడ్ గ్రామాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మిగతా గ్రామాలకు కూడా మార్గం చూపండి.

**మొదటి చర్య :**

### నీ పొలంలో కుంటకట్టలు మరియు వర్షపు నీటి గుంత (Farm Pond) ఏర్పాటు :

మొట్టమొదటిగా, నీ పొలంలో తగిన విధంగా భూసార సంరక్షణకు మరియు వర్షపు తేమను కాపాడుటకు కట్టలు వేసుకొనవలెను. అంతేగాకుండా తగ్గుభాగంలో ఒక వర్షపు నీటి గుంతను త్రవ్వుకొనవలెను. కుంటకట్టలు, చెట్లు నాటుటకు అనుకూలంగా వుండునట్లు వేయించుకొనవలెను. నీటి గుంత లోపల భాగంలో ఒక పొరగా చౌడును వేసి, నీరు భూమిలోకి ఇంకిపోకుండా చేసుకొనవలెను. ఆ నీటిని పంటలకు ఒక తడి ఇచ్చేదానికి ఉపయోగించుకొనే ఉద్దేశ్యంతో ఆ నీటి గుంతను నిర్మించవలెను. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

**రెండవ చర్య :**

**మూడు ఎకరాలలో పండ్లచెట్లు :**

5 ఎకరాలలో దాదాపు 3 ఎకరాలకు వర్షాధార పండ్లతోటలు మిశ్రమ పంటగా పెంచవలెను. మూడు ఎకరాలలో కొన్ని మామిడి, చింత, కొన్ని సీతాఫలం, కొన్ని సపోట, కొన్ని రేగులాంటి మొక్కలను పెంచవలెను. మిశ్రమ పంటలుగా / భూమి వృధాకాని విధంగా వరుసలను, వరుసల మధ్యన చెట్లు నాటవలెను. మొదటి 3 సంవత్సరాలు వాటికి నీటిని పోసి పోషించవలెను. నీకు బోరుబావులు ఉండనవసరం లేదు. ఎద్దులబండ్లు, ట్రాక్టర్ల ద్వారా నీటిని తరలించి కీలక సమయాలలో తడినిచ్చి పోషించవలెను. అవసరమైతే, నీటిని యితరుల దగ్గర కొనుక్కొని అయినా వాటిని పోషించవలెను. వాటర్‌షెడ్ గ్రామాలలో ఈ విధంగా పండ్లమొక్కలు పెంచుటకు 3 సంవత్సరాలు సహాయ సహకారాలను మన సంస్థ అందిస్తుంది. 5 లేక 6 సంవత్సరాల తర్వాత పండ్లతోటలు పంటనియ్యడం మొదలౌతుంది. కనీసం 3, 4 రకాల పండ్లచెట్లు వుండటం వలన, ఒక్కొక్క సీజన్‌లో ఒక్కొక్క పండ్ల పంట ద్వారా ఆదాయం చేతికొస్తుంది.

**నీటిని కొనడమా ? అని మీకు అనుమానం రావచ్చు !**

ఔను ! ఇతర వస్తువులను, ఆస్తులనుకొన్నట్లే నీటిని కూడా మితంగా, కీలకంగా తగిన (Life saving or critical irrigation) విధంగా పంటను రక్షించుకొనుటకు అవసరమైనంత కొనవచ్చు. చెక్‌డ్యాములు, చెఱువులలో నీరు లేనప్పుడే ఆ విధంగా కొనవలసిన అవసరం ఏర్పడుతుంది. అనంతపురంలో త్రాగునీటి కోసం ఒక ట్రాక్టరులో 20,000 లీటర్లుగల ట్యాంకరు నీరు రూ. 150/-లకు అమ్ముతున్నారు. ఆ విధంగా 20,000 లీటర్లను ఒక్కొక్క చెట్టుకు 4 లీటర్ల ప్రకారం 5,000 చెట్లకు ఒకసారి తడి ఇవ్వవచ్చును. లేదా ఒక అర్ధ ఎకరా కూరగాయలకు ఒక తడి వేసుకొనవచ్చును.

బీహారు, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో 70 శాతం పైగా రైతులు ఈ విధంగా కొన్న నీటితోనే వ్యవసాయం చేస్తున్నారు. ఇది వాస్తవం! కాబట్టి, మనం కూడా చేయవచ్చు. ఆశ్చర్యపోవద్దు !

**మూడవ చర్య :**

**రెండు ఎకరాలలో వర్షాధార మిశ్రమ పంటలు :**

మిగిలిన రెండు ఎకరాలలో వర్షాధారంపైన కొంత వేరుశనగ, కొంత కూరగాయలు, కొంత పచ్చిమేత, కొంత కంది, ఆముదం, బంతిపూలులాంటి పంటలను నీకు నచ్చిన మోతాదులో పెట్టవలెను. వర్షాధార పంటలకు కూడా ఒరుపులో అవసరమైతే కొన్ని పంటలకైనా నీటిని తరలించి, ఒక్కతడి ఇచ్చే ఏర్పాట్లు చేసుకోవలెను. చెక్‌డ్యాము నుండీ, చెఱువుల నుండీ తరలించే ఏర్పాట్లు చేసుకోవాలి. అక్కడ నీరు లభ్యంకాని సందర్భాలలో నీటిని కొనుక్కొని అయినా ఒక తడి నీరు ఇస్తే, వర్షాధార పంటలు కొంతకు కొంత చేతికందే అవకాశముంది. మనం పంటలు విత్తేటప్పుడు ఆ విధంగా నీటి తడి పెట్టుటకు అనుకూలంగా ఉండునట్లు వివిధ పంటలను విత్తుకొనవలెను.

**నాలుగవ చర్య :**

**రెండు పాడిపశువులు లేదా 10 గొఱ్ఱెలు / మేకలు పెంచడం :**

రెండు పాడి పశువులను కానీ, పది చిన్న జీవాలను (గొఱ్ఱెలు / మేకలు) కానీ పెంచే ఏర్పాట్లు చేసుకోవలెను. 'వెలుగు' పథకం ద్వారా, బ్యాంకుల ద్వారా, పొదుపు గ్రూపుల ద్వారా అప్పులను పొంది ఆ విధంగా పశువులను పెంచుటకు అవకాశాలున్నాయి. ఐతే, వాటికవసరమైన మేతను కూడా మనమే పెంచుకొనవలెను. అదనంగా కొంత దాణాను కూడా కొని వేయవలెను. వర్షాకాలంలో గడ్డి బాగావున్న కాలంలో బయటమేపి, అట్లా లేని కాలంలో ఇంటి దగ్గరే వట్టిమేత, దాణాలతో మేపే ఏర్పాట్లు చేసుకోవాలి. పాడిద్వారా లేదా చిన్న జీవాల ద్వారా సంవత్సరానికి దాదాపు రూ. 10,000/-లు అదనపు ఆదాయాన్ని సంపాదించడం సాధ్యమౌతుంది.

**ఐదవ చర్య :**

**పొలం మేరలలో భిన్న పంటలు :**

నీ పొలం మేర చుట్టూ కలబంద, సుబాబుల్, నీలగిరి, వేప, అవిశెలాంటి పంటలు వర్షాకాలంలో నాటవలెను. అవన్నీ వర్షాధారానికి బ్రతికే అవకాశమున్నవి. అట్లా నాటినప్పుడు, 3 సంవత్సరాలలో నీ పొలం చుట్టూ కోటగోడలాంటి మేర ఏర్పడుతుంది. ఆ పొలం మేర, అడవి పందుల బారి నుండి మరియు రోగాలు, దొంగల బారినుండి పంటలను రక్షించడమే గాకుండా నార, పశువుల మేత, వ్యవసాయ పనిముట్లు మొదలగు వాటి ద్వారా కొంత ఆదాయం కూడా పెరుగుతుంది.

**ఆరవ చర్య :**

**వానపాములతో ఎఱువులు, పచ్చి ఎఱువులు, రసాయనిక (ఇంగ్లీషు) మందులు లేకుండా చీడపీడల నివారణ :**

నీవు వానపాముల ఎఱువు తయారుచేసుకోవలెను. అదనంగా పచ్చి ఆకులతో కంపోస్టు కూడా తయారుచేసుకొని, రసాయనిక ఎఱువులపై ఖర్చును బాగా తగ్గించవలెను. అదేవిధంగా, చీడపీడల నివారణకు కూడా సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా అనగా, వేప, కానుగ, మిరపలాంటి కషాయముల ద్వారా, మిత్ర పురుగుల ద్వారా రసాయనిక మందుల వాడకాన్ని, తద్వారా ఖర్చును తగ్గించుకొనవలెను. నీవు ఎంత ఖర్చు తగ్గించుకొంటే, అంత ఆదాయం నీకు వచ్చినట్లే !

**నీ పొలానికి ఒక సమగ్ర వ్యవసాయ ప్రణాళిక తయారు :**

పైన చెప్పిన 5 ఎకరాల పద్ధతులను దృష్టిలో వుంచుకొని, నీ పొలమునకు ఒక సమగ్ర ప్రణాళిక తయారుచేయవలెను. సమగ్ర ప్రణాళికలో వివిధ రకాలైన పండ్ల చెట్లకు, వేరుశనగ, మేత, పూలు మొదలగు గడ్డి చెట్లకు, నారచెట్లకు, వీలైతే కొన్ని ఔషధ మొక్కలకు, తగినంత ప్రాధాన్యం ఇవ్వవలెను. అన్ని పంటలనూ "అంతరపంటలు"గా మరియు "మిశ్రమ పంటలు"గా వ్యవసాయ ప్రణాళికలో కనపరచవలెను. పాడిపశువులను, గొఱ్ఱెలు, మేకలను సంపాదించుకొనుటకు, వాటిని పొలంలోనే పోషించుటకు తగిన విధంగా ప్రణాళిక వేయవలెను.

**ముగింపు :**

పైన చెప్పిన పద్ధతిని "సమగ్ర వ్యవసాయ పద్ధతి" అనీ, లేదా "బహుళ పంటల విధానము" అని అనవచ్చును. తద్వారా మెట్ట రైతు జీవనం చేయడానికి తగిన ఆదాయాన్ని పొందడానికి రైతు ప్రయత్నించవలెను. వాటర్‌షెడ్ గ్రామాలలో ఇటువంటి వ్యవసాయ పద్ధతిని పాటించి, ఇతరులకు మార్గదర్శకంగా నిలువవలెను. ఈ పద్ధతి గురించి, ఇందులోని మంచి చెడులను, సాధ్యాసాధ్యాలను గురించి రైతులు చర్చించవలెను. ఇంకనూ, మంచి ఉపాయాలు ఇందుకు తోడు చేయవలెను. తద్వారా ఈ పద్ధతిని ఆచరణాత్మకంగా తయారుచేసి మన వాటర్‌షెడ్ గ్రామాలలో అమలుచేయవలెనని నా మనవి.

మీ విశ్వసనీయుడు,

**వై. వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి**

ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్

# వాటర్‌షెడ్ గ్రామాల వార్తలు

## డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో పండ్లతోటల పెంపకం :

నక్కలపల్లి గ్రామంలో వుంటున్న వై.సి.నారాయణరెడ్డి అను నేను 2002-2003 సంవత్సరంలో ఆర్.డి.టి. సంస్థ అందించిన సబ్సిడీతో నాకున్న 4 ఎకరాల భూమిలో దానిమ్మ, సపోట చెట్లను నాటుకొని శ్రద్ధగా కాపాడుకొంటున్నాను. 2004-05 సంవత్సరంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నా భూమిలో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఏర్పాటు చేసుకొని చెట్లను సంరక్షించుకొనుచున్నాను.

ఈ పండ్ల తోటల పెంపకం ద్వారా సంవత్సరానికి దాదాపు 90 వేల రూపాయల వరకు ఆదాయాన్ని పొందుతున్నాను. వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ, డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి పాటించడంతో మిగిలిన పంటల కన్నా పండ్ల మొక్కల ద్వారా ఆదాయం సమకూరింది.

**- వై.సి.నారాయణరెడ్డి, తండ్రి చిన్న చన్నయ్య, నక్కలపల్లి గ్రామం.**

## కన్నులపండువగా 'బండమీదపల్లి' గ్రామంలో జరిగిన శ్రమదానం - గ్రామ సభ

శెట్టూరు ఏరియా బండమీదపల్లి వాటర్‌షెడ్ గ్రామంలో 20-10-2004వ తేదీన గ్రామ సభ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. గ్రామ సభనాడు అందరూ గ్రామంలోనే ఉండాలని గ్రామస్థులు తీర్మానించారు. ఆ రోజు ఉదయం 7 గం॥ల నుండి శ్రమదాన కార్యక్రమం జరిగింది. ఇందులో 30 ఎద్దుల బండ్లు, 108 మంది స్త్రీ, పురుషులు పాల్గొన్నారు. గ్రామంలో స్కూలు దగ్గర పెద్ద పెద్ద గుంతలు ఉండేవి. ఆ గుంతలకు 144 క్యూబిక్ మీటర్లు మట్టితోలడం జరిగింది. మధ్యాహ్నం 1 గం॥ వరకు నిర్విరామంగా శ్రమదానం జరిగింది. పిమ్మట, గ్రామస్థులందరూ వివిధ రకాల ఆటల పోటీలు అనగా కబడ్డీ, క్రికెట్, పరుగు పందెం మొదలైన వాటిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 7-00 గం॥ వరకు ఈ ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. తర్వాత 8-00 గం॥ గ్రామసభ ప్రారంభమైంది. 'మద్యపాన నిషేధం' అనే అంశంపై చక్కని నాటకం ప్రదర్శించి సభికులను ఆశ్చర్యచకితులను చేశారు. వాటర్‌షెడ్ కార్యక్రమాల ఖర్చుల వివరాలను తెలియజేశారు. గ్రామసభ ముగింపులో క్రీడలలో గెలుపొందినవారికి బహుమతుల ప్రదానం చేశారు.

శ్రీ థామస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టరు, శ్రీ ప్రభాకర్, ఇ.ఎస్., యాక్షన్ ఫ్రెటర్నా, ఆర్‌డిటి వాటర్‌షెడ్ కమిటీ, వి.డి.సి., గ్రామైక్య సంఘం మరియు గ్రామస్థులు పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

### అభిప్రాయం

మా గ్రామంలో వాటర్‌షెడ్ ఉన్నందున దానిలో భాగంగా మహిళా శిక్షణా తరగతులు నిర్వహించుట వలన మేము నేర్చుకుని ఇతర గ్రామాల మహిళలకు కూడా శిక్షణ ఇచ్చే స్థాయికి మేము ఎదుగుతున్నాము.

**లక్ష్మీదేవి, సుశీలమ్మ, గ్రామైక్య సంఘం లీడర్లు, చిన్న హోతూరు గ్రామం.**

## కరిగానిపల్లి వాటర్‌షెడ్ గ్రామం

### ఆరు నెలల నివేదికపై కుందుర్పి మండలం ఎం.ఆర్.ఓ., స్పందన

కరిగానిపల్లి వాటర్‌షెడ్ గ్రామంలో జరిగిన కార్యక్రమాలపై సమర్పించిన ఆరు నెలల నివేదిక (01-04-2004 తేది నుండి 30-09-2004 వరకు) పై మండల రెవిన్యూ అధికారి, కుందుర్పి మండలం, వారు తమ అభినందనలు తేది 09-01-2005 న వ్రాతపూర్వకంగా ఈ విధంగా తెలియజేసినారు. ఆయన వ్యక్తీకరించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

"వాటర్‌షెడ్ కార్యక్రమాల 6 నెలల 5వ నివేదిక చదవడం జరిగింది. అందులో సదరు గ్రామస్థులు ఆడ, మగ, పిల్లలతో సహా భాగంపంచుకున్న కార్యక్రమాలలో వరిని నాటుతున్న మహిళా రైతులు, నీరు నిల్వవున్న మట్టికట్టలను నిర్మించుకున్న రైతులు, ప్రత్యామ్నాయ పంటగా వేసుకున్న జొన్న చేను రైతు రామచంద్ర మరియు ఉలవ చేను వేసుకున్న రైతు లక్ష్మిదేవి, కూరగాయ తోటలు పెంచుతున్న మహిళా రైతు లక్ష్మక్క వారలు, నిజంగా మిగతా రైతులందరికీ ఆదర్శ రైతులు. సదరు రైతులు భూసారము మరియు నీటి పరిరక్షణకు గాను, వాలుకు అడ్డంగా మట్టి కట్టలు వేసిన విషయం నిజంగా అభినందనీయము. ప్రస్తుతం, ఆదాయపు పంటగా వేరుశనగ పంటను కాదని ఉలవ, కూరగాయలు, జొన్న పంటలు వేసిన రైతుల ధైర్యానికి జోహారులు! జొన్న, ఉలవ పంటలు వేసి, దిగుబడి పొందడమే కాకుండా, పశువులకు మేత కూడా లభించునని వారు ఋజువు చేశారు. గ్రామంలో చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా, శ్రమదానంలోనూ, వాటర్‌షెడ్ కార్యక్రమాలలోనూ పాల్గొని వారి ఐకమత్యాన్ని చాటుకున్నారు. వీటన్నిటికీ మూలం ఆర్.డి.టి. సంస్థ. నిజంగా వారి కృషి విలువ కట్టలేనిది. వారు గ్రామాలలో సభలు జరిపి, చర్చావేదికలలో రైతులకు సంబంధించిన విషయాలు చర్చించుకొనుట, గ్రామైక్య సంఘాలకు మరియు మహిళా సంఘాల సభ్యులకు సదస్సులు జరిపి, శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి, వారిలో దాగున్న శక్తిని చైతన్యపరచి వారిలోని సేవాతత్పరతను, స్నేహాభావాన్ని పెంపొందించినారు. అనగా 6 సంవత్సరాల కాలంలో మొత్తం 20 లక్షల మొత్తమును గ్రామస్థులు భూసార సంరక్షణ కార్యక్రమం కొరకు, చప్పిళ్ళు నిర్మించుటకు, సహజ ఎఱువులు రూపొందించుట కొరకు, చెక్‌డ్యామ్‌ల కొరకు, త్రాగునీటి సరఫరా కొరకు, రోడ్డుకిరువైపులా మొక్కల కొరకు ఈ విధంగా ఎన్నో మంచి పనులకు ఖర్చు పెట్టడం చాలా ఆశ్చర్యానందాలు కలిగించుచున్నవి. ఎవరికి వారే యమునా తీరే! అన్నట్లుగా వున్న ఈ కాల పరిస్థితులలో ప్రభుత్వ నిధులు లేకుండా స్వచ్ఛందంగా, నిస్వార్థంగా సేవ చేయుచున్న ఆర్.డి.టి. సంస్థ, సంస్థలో పనిచేయుచున్న అధికారులు, సిబ్బందిసేవలు మరువలేనివి. అలాగే, గ్రామస్థులందరూ కలిసి ఐకమత్యంగా, ఆర్.డి.టి. సంస్థ యొక్క సేవలకు స్పందించి తదనుగుణంగా వారు కూడా లబ్ధి పొందడము కూడా అభినందనీయము. ఇలాగే గ్రామ ప్రజలంతా కలిసి, తమ గ్రామమును రాష్ట్రస్థాయిలోనూ, దేశస్థాయిలోనూ ఉత్తమమైన గ్రామంగా చేయాలని కోరుచున్నాను. ఇందుకనుగుణంగా ఒక మండల రెవిన్యూ అధికారిగా, ప్రజలకు మరియు ఆర్.డి.టి. సంస్థకు మరియు అందులో పనిచేయుచున్న అధికారులకు నా సహకారం ఎల్లవేళలా ఉండునని తెలియజేయుచున్నాను."

**మండల రెవిన్యూ అధికారి, కుందుర్పి మండలం, అనంతపురం జిల్లా.**

## ఈ మాసపు సూక్తి :

అసమాన ప్రియనీతి వర్తనము, ప్రాణాంతంబునందున్ మలీ<br>
మస మగ్రాహ్య, మదుష్టయాచన, మసంపత్రార్థనాభావమున్,<br>
వ్యసనావాప్తిని ధైన్యముం, బుధజనాత్యంతానుకూలత్వం, మీ<br>
యసి ధారావ్రత చర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో !

– భర్తృహరి –

**తాత్పర్యము :**

న్యాయమార్గం వీడని జీవన విధానాన్ని అవలంబించడం, ప్రాణాపాయం కలిగినప్పుడు కూడా చెడ్డ పనులు చేయకపోవడం, అవసరం కలిగినా కూడా చెడ్డ మనుషులను ప్రార్థించకుండా ఉండటం, కష్టాలలో ధైర్యంగా మెలగడం, మహాత్ములను వ్యతిరేకించకుండా వారికనుకూల మార్గంలో పయనించడమనే కత్తిమీద సాము వంటి జీవన విధానం సజ్జనులకు పుట్టుకతో వచ్చినదేగానీ ఇతరులు ఉపదేశించడం వలన అలవడింది కాదని భర్తృహరి అంటున్నాడు.

**చర్చ :**

సాంకేతిక విజ్ఞానం పెరిగే కొద్దీ వ్యాపార దోపిడీ సంస్కృతి ప్రభావం సమాజంలోని ప్రజల జీవితాల మీద విశేష ప్రభావాన్ని చూపుతున్నది. సమాజంలో అన్ని రంగాలలో అభివృద్ధి అభిలషణీయమే. సాంకేతిక విజ్ఞాన అభివృద్ధిని ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి విశ్లేషిస్తే, ఈ పెరుగుదల మనకు కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఒకప్పుడు దూర ప్రాంతాల నుంచి టెలిఫోన్ చేయడం చాలా అబ్బురమైన విషయంగా ఉండేది. గడిచిన 50 సంవత్సరాలలో టెలికాం రంగం శరవేగంగా అభివృద్ధి చెందింది. నేడు గ్రామాలలో సైతం జేబుల్లో సెల్‌ఫోన్లు పెట్టుకొని అతి సులభంగా దూరప్రాంతాలలో వున్నవారితో సైతం అతిదగ్గరగా మాట్లాడుతుండటం మనం చూస్తూనే ఉన్నాము! దేశ విదేశాలలో జరిగే సంఘటనల్ని కళ్ళకు కట్టినట్లుగా టి.వి.ల ద్వారా చూస్తున్నాం. ఇక ఇంటర్నెట్ విప్లవం సంగతి సరేసరి.

అతి త్వరలోనే కుగ్రామాలలోకి కూడా ఇంటర్నెట్ ప్రవేశించబోతోంది. సాంకేతిక విజ్ఞాన అభివృద్ధిలో మంచి, చెడు రెండూ ఉంటాయి. ఐతే, మనం "ఈ విజ్ఞానాన్ని సక్రమమైన పద్ధతిలో ఉపయోగిస్తున్నామా"? అని ప్రశ్నించుకోవలసి ఉంది. సమాజంలో న్యాయమార్గం వీడని జీవన విధానాన్ని అవలంబించడం, ప్రాణాపాయం కల్గినప్పుడు కూడా చెడ్డ పనులు చేయకపోవడం వంటివి ఉత్తమమైన జీవన విధానంగా భర్తృహరి ఆనాడే సమాజానికి సూచించాడు.

ఇప్పుడు మీకొక అనుమానం కలగవచ్చు. అభివృద్ధి అనేది సంతోషించాల్సిన విషయమేగదా, దాని గురించి అంత బాధపడాల్సిన విషయం ఏముంది ? అని. నిజమే, సాంకేతిక అభివృద్ధిని గురించి తప్పక సంతోషించవలసిందే! ఐతే, ముందు చెప్పుకున్నట్లుగా పెరుగుతున్న అభివృద్ధి వ్యాపార సంస్కృతిలో పనిముట్టుగా మారి మానవ సంబంధాలను, మానవ విలువలను, నైతిక ప్రవర్తనను చావు దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు, దూరప్రాంతాలలోని మనుషులను దగ్గరికి చేర్చాల్సిన సెల్‌ఫోన్‌లను అందులో వుండే కెమెరాల ద్వారా అమ్మాయిలను అశ్లీలంగా ఫోటోలు, వీడియోలు తీసే నీచ సంస్కృతికి కొంతమంది ఉపయోగిస్తున్నారు. దేశవిదేశాల్లోని వార్తలను ఎప్పటికప్పుడు కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్న టెలివిజన్లలో అసభ్య, అశ్లీల దృశ్యాలను కూడా ప్రసారం చేస్తున్నారు. ప్రపంచంలోని విజ్ఞానాన్ని చేతివేళ్ళ కదలికలతో అందుబాటులోకి తెచ్చి, దేశాల మధ్య దూరాన్ని చెరిపేసి, ప్రపంచాన్ని ఒక కుగ్రామంగా మార్చేసిన ఇంటర్నెట్ సైబర్ అభివృద్ధిని అశ్లీల, అసాంఘిక కార్యకలాపాలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

పెరుగుతున్న విజ్ఞానంతోబాటు, తరుగుతున్న మానవ విలువలు, సభ్యతాసంస్కారాల్ని కూడా పెంపొందించుకోవాలి. విజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, విలువలు లేని సమాజం మానవ సమాజం అనిపించుకోదు.

**వై.వి. మల్లారెడ్డి**

# ఈ మాసంలో వ్యవసాయం

## రబీ వేరుశెనగ

**పంటకోత - ఎండబెట్టుట**

రబీ వేరుశెనగ పంటకోత మార్చి-ఏప్రిల్ నెలలో వస్తుంది. కాబట్టి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. కాయలను నేరుగా సూర్యరశ్మిలో ఎండబెట్టినట్లైతే విత్తనంలోని పిండం చనిపోయి మొలకెత్తే శక్తిని కోల్పోతుంది. నీడలో 2-3 రోజులు ఆరబెట్టి విత్తనంలోని తేమశాతం తొమ్మిదికి మించకుండా ఉండేటట్లు చూసుకుంటే విత్తనం ఎక్కువకాలం చెడిపోకుండా నిల్వ ఉండటమేగాక విత్తనం మంచి మొలకశాతాన్ని కలిగియుంటుంది. ఈ విధంగా చేస్తే 'అఫ్లాటాక్సిన్' శాతం కూడా తక్కువ మోతాదులో ఉండి విత్తనం నాణ్యంగా ఉంటుంది.

**గోదాములో నిల్వ :**

కాయతొలుచు పురుగులు (పెంకు పురుగులు) కాయలకు, విత్తనాలకు రంధ్రాలు చేసి విత్తనాన్ని పూర్తిగా నాశనం చేస్తాయి. ఈ విధంగా పాడైన విత్తనాల ద్వారా అఫ్లాటాక్సిన్ అధికమయ్యి మిగతా విత్తనాలు కూడా చెడిపోయి నాణ్యతను కోల్పోతాయి. ఈ పురుగుల నుండి కాయలను కాపాడుటకు ఒక కిలో కాయలకు 5 మి.లీ. వేపనూనె గానీ, కానుగ నూనెగానీ కలిపి ఉంచితే దాదాపు 5 నెలల వరకు కాయ తొలుచు పురుగులనుండి వేరుశెనగ కాయలను కాపాడుకోవచ్చు.

విత్తన కాయలను భద్రపరిచే గోనె సంచులను ముందుగా బాగా ఎండబెట్టి, "మాలథియాన్" ద్రావణంలో నానబెట్టి, ఆరిన తర్వాత కాయలను నింపి భద్రపరిస్తే పురుగుల బెడద ఉండదు. **(ఈనాడు, 27-12-2004 సౌజన్యంతో)**

## జీవ క్రిమికీటక నాశనులే మంచివి

రసాయనిక పురుగుమందులు వ్యవసాయానికి, పర్యావరణానికి ఎంతో కీడు చేస్తాయి. రసాయనిక క్రిమిసంహారాలవల్ల వాటిల్లే దుష్ప్రభావాన్ని గ్రహించిన శాస్త్రవేత్తలు, రైతులు కలిసి నేడు చీడపీడల నివారణకు జీవపరమైన పదార్థాలను వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

మొక్కలు, వృక్షాల నుండి లభించే క్రిమిసంహారక గుణాలు ఉండే వివిధ పదార్థాలను క్రిమికీటకాల నివారణకు వాడవచ్చు. అటువంటి పదార్థాలను **"జీవక్రిమికీటక నాశనులు"** (బయో పెస్టిసైడ్స్) అంటారు.

జీవ క్రిమికీటక నాశనులు రసాయన క్రిమికీటక నాశనులకంటే ఎందువల్ల మంచివో ఈ క్రింది వివరాలు చదివితే మీకే అర్థమవుతుంది.

### రసాయనిక పురుగుమందులు చేసే హాని

1. రసాయనిక పురుగుమందులును నిరంతరంగా వాడటంవల్ల క్రిమికీటకాలు వాటికి అలవాటుపడి వాటిని నియంత్రించడం కష్టమై పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.
2. అవి పంటల తెగులు నిరోధకశక్తిని ఏమేరకు నాశనం చేస్తాయంటే, ఒక దశాబ్దంపాటు రసాయనిక మందులు వాడిన తర్వాత పురుగులు వాటికి అలవాటుపడి మరింత ఉధృతమయ్యాయి.
3. రసాయనిక మందులు ఖచ్చితంగా నిర్దేశించిన మోతాదులోనే వాడవలసి ఉంటుంది. ఆ మందుల పెట్టెలు లేదా సీసాలలోవున్న సూచనలను సాధారణంగా రైతులు చదవలేరు. అర్థంచేసుకోలేరు, లేక అమాయకత్వంతో ఆ సూచనలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఎక్కువ మోతాదులో మందులు వాడిన పొలాలనుండి ఎక్కువైపారే సాగునీరు కలిసి సమీపంలోని నదులు, చెరువులు, కుంటలు విషపూరితమవుతాయి. లేదా అలా కొట్టుకొనిపోయిన రసాయనాలు భూమిలోకి ఇంకి విషపూరితమవుతుంది.
4. రసాయనిక మందులు వాడటంవల్ల నేలలోవేసిన పంటలో విషపదార్థాలు మిగిలిపోతాయి. అటువంటి ధాన్యాలను, కూరగాయలను, పండ్లను తినడంవల్ల మానవులకు అలెర్జీలవంటి ఇబ్బందులు, జబ్బుపడటం, ఒక్కోసారి క్యాన్సర్ వంటి వ్యాధులు రావచ్చు.
5. రసాయనిక క్రిమిసంహారకమందులు వేసే సమయంలో రైతులు ఎంతో ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొనవచ్చు. నిరంతరాయంగా రసాయన మందుల వాడకంవల్ల పలువురికి తీవ్ర చర్మ, ఊపిరితిత్తుల సంబంధమైన జబ్బులు సోకిన దాఖలాలున్నాయి.
6. రసాయనిక మందులవల్ల పంటలకు మేలుచేసే పురుగులు కూడా చనిపోతాయి.

### జీవ క్రిమి కీటకనాశనులు చేసే మేలు

1. భూమి సారాన్ని పరిరక్షించి పంటల తెగులు నిరోధక శక్తిని పెంచుతాయి.
2. జీవ క్రిమిసంహారకాలను నిరంతరం వాడినా కీటకాలు, పురుగులు, వివిధరకాల క్రిములు వాటికి అలవాటుపడటమన్నది ఉండదు.
3. క్రిమికీటకాలకు సహజ శత్రువులైన సాలెపురుగులు, భూమిని సారవంతంచేసే వానపాములవంటి వాటికి నిరపాయకరమైనవి.
4. ఇవి పర్యావరణానికి హానిచేయవు. తేలికగా కుళ్ళి మట్టిలో కలిసిపోతాయి.
5. ఎక్కువ మోతాదులో వాడినా భూమిలోగానీ లేక వ్యవసాయ ఉత్పత్తులలోగానీ విషపూరితమైన అవశేషాలేమీ ఉండవు. కనుక, మానవులకు నిరపాయకరం.
6. ఘాటైన వాసనవల్ల కీటకాలు పంటలను తినడం తగ్గి వాటి పెరుగుదలపై ప్రభావం చూపుతుంది.

బయో పెస్టిసైడ్స్ వంటి చెట్ల నుండి తయారుచేసే సహజ క్రిమికీటక నాశనాలను వాడి, సాంప్రదాయక తెగులు నివారణా పద్ధతులకు మళ్ళడం ద్వారా రసాయనిక మందులవల్ల జరిగే హానిని రైతులు నివారించగలరు. ఐతే, ఇది క్రమక్రమంగా జరగాలి. అత్యధిక క్రిమికీటకాలు ఎక్కువ రసాయనిక మందుల మోతాదులకు అలవాటు పడిపోయినందువల్ల వీటిని నియంత్రించడం కష్టం. అందువల్ల, ప్రారంభంలో కేవలం బయో పెస్టిసైడ్స్ వినియోగించి వాటిని నియంత్రించడం సాధ్యం కాకపోవచ్చు.

**("బుక్స్‌లైన్" వారి సౌజన్యంతో)**

## రైతు స్థాయిలో ఎన్.పి.వి. ద్రావణం తయారి

పంటలను చీడపీడల నుంచి కాపాడే క్రమంలో నేడు రసాయనాల వాడకంవల్ల పంటలపై ప్రకృతి సిద్ధంగా ఉండవలసిన పురుగుల మధ్య సమతుల్యత దెబ్బతింటున్నది. ఒకనాడు నష్టంచేయని, చేయలేని స్థాయిలో ఉండే క్రిమికీటకాలు క్రమేపీ పంటలకు నష్టంచేసే ఇబ్బందికరస్థాయికి చేరుకున్నాయి. చాలారకాల పురుగులు పురుగు మందులకు నిరోధకశక్తిని పెంచుకుని రైతులకు, శాస్త్రవేత్తలకు పెనుసవాలుగా మారాయి. అలానే మనకు ఉపయోగపడే పంటలను ఆశించే కీటకాలపై జీవించే చాలారకాల బదనికలు, పరాన్నజీవులు చనిపోవడం మూలాన పురుగుల ఉధృతి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో "సమగ్ర సస్యరక్షణ" అనే నినాదం సర్వత్రా వినిపిస్తున్నది. దీనిలో చాలా ముఖ్యమైన భాగం జీవనియంత్రణ పద్ధతులు.

మళ్ళీ జీవనియంత్రణలో కూడా చాలా విధానాలున్నాయి. వాటిలో ముఖ్యమైనది న్యూక్లియర్ పాలిహైడ్రోసిస్ వైరస్ (ఎన్.పి.వి.) ద్రావణం వాడి పురుగులను నియంత్రించడం, శెనగపచ్చ పురుగుకు, పొగాకు లద్దె పురుగుకు వేర్వేరు వైరస్ ద్రావణాలను వాడాలి.

రైతుస్థాయిలో ఎన్.పి.వి. ద్రావణం తయారుచేయుటకు కావలసిన పదార్థాలు.

1) శెనగలు (మంచి శెనగలు) 300 గింజలు (2) ఎన్.పి.వి. మదర్ కల్చర్, నీరు (3) ఖాళీ ఇంజక్షన్ సీసాలు (250) (4) ప్లాస్టిక్ ట్రే, ప్లాస్టిక్ మగ్ (5) శెనగపచ్చ పురుగు లార్వాలు (3,4 దశల్లోకి చేరినవి)

ఎన్.పి.వి. ద్రావణం తయారుచేసేందుకు ముందుగా శెనగ గింజలను నానబెట్టాలి. ఒకరోజు నానిన గింజలు ఉబ్బి, మెత్తగా అవుతాయి. వీటిని ఒక ప్లాస్టిక్ ట్రేలోకి తీసుకొని ఎన్.వి.పి. మదర్ కల్చర్ 50 ఎల్.ఇ. చిలకరించాలి. ఈ మదర్ కల్చర్ ద్రావణం జీవనియంత్రణ ప్రయోగశాలల్లో, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుసంధానమై ఉన్న ప్రయోగశాలల్లో , పరిశోధనా కేంద్రాలలో లభిస్తుంది. మదర్ కల్చర్‌ను వేసి బాగా శెనగగింజలకు పట్టించి ఐదారు గంటలు ఉంచాలి. ముందుగానే సేకరించుకున్న ఇంజక్షన్ సీసాలలో ఒక్కో సీసాలో ఒక్కో శెనగ గింజను (నానబెట్టి, మదర్ కల్చర్ పట్టించిన వానిని) వేయాలి. ఇలా సిద్ధం చేసుకున్న సీసాల్లోకి ఒక్కోదానిలో ఒక్కో శెనగపచ్చ పురుగు లార్వాను ప్రవేశపెట్టాలి. తర్వాత సీసామూతిని దూదితో బిగించాలి. వదిలిన లార్వాలు శెనగగింజలను ఆహారంగా తీసుకుని 3, 4 రోజుల్లో వైరస్‌సోకి చనిపోతాయి. కావాలనుకుంటే 3వ రోజు తర్వాత ఈ పురుగులకు మామూలు ఆహారం (అనగా ఎన్.పి.వి.తో కలపని) నానబెట్టిన శెనగ గింజలను ఇవ్వచ్చు. చనిపోయిన 250 లార్వాలను ప్లాస్టిక్ మగ్‌లోకి సేకరించుకోవాలి. వీటికి పావులీటరు నీరు కలపాలి. వీటిని మిక్సీలో వేసి నూరాలి. ఆ తర్వాత పల్చని గుడ్డతో వడపోయాలి. ఇలా వడపోయగా వచ్చిన ద్రావణానికి ఒక కిలో బెల్లం, 50 గ్రాముల రాబిన్ బ్లూ + 100 మి.లీ. టిపాల్ కలిపి ఎకరా పొలంలో పిచికారి చేయాలి.

ఇంకో పద్ధతిలో కూడా రైతులు స్వయంగా ఎన్.పి.వి. ద్రావణాన్ని తయారుచేసుకోవచ్చు. వైరస్ సోకి చనిపోయిన లార్వాలు పొలంలో మొక్కల కొమ్మల చివర్లలో తలక్రిందులుగా వేలాడుతూ కనిపిస్తాయి. ఇటువంటి 250 లార్వాలను సేకరించుకుని ఒక పాత్రలో వేసి, మంచినీళ్ళు కలిపి, మెత్తగా నూరి ద్రావణం చేసి పల్చని గుడ్డ ద్వారా వడపోయాలి. 200-250 వ్యాధి సోకిన పురుగుల నుండి వచ్చిన ద్రావణానికి 200 లీ. నీటికి కలిపి దీనికి ఒక కిలో బెల్లం ఎన్.పి.వి. ద్రావణాన్ని చల్లని సమయాల్లో, సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి. **("అన్నదాత" జనవరి 2005 సౌజన్యంతో)**

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990